
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 15 మే 2025



చెరువు మట్టి.. చేనుకు బలం

- ఒండ్రు మట్టిలో పోషకాలు పుష్కలం
- పొలాల భూసారం పెరుగుదల
- చీడపీడల బెడద కూడా తక్కువే
- ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ భూములకు తరలింపు

7



పచ్చళ్ల పండుగ

మే నెలలో పున్నమి వెళ్లిన తర్వాత పచ్చళ్ల తయారీకి జనం మొగ్గుచూపుతారు. ఈ క్రమంలో సిద్దిపేట రైతుబజార్ సమీపంలో పచ్చడి మామిడికాయల విక్రయాలు జోరందుకున్నాయి. కాయ సైజును బట్టి రూ.10 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. కటింగ్‌కు సైజును బట్టి రూ.2 నుంచి రూ.3 చొప్పున వసూలు చేస్తున్నారు. ధరలు ఎలా ఉన్నా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



ఆ ఠాణాలను సందర్శించిన

ఉన్నతాధికారులు

- సిబ్బంది పనిపై ఆరా
- తీరు మార్చుకోవాలని హెచ్చరిక
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బెజ్జంకి/మిరుదొడ్డి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన "అంతా మా ఇష్టం" కథనం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ఓ పోలీసుస్టేషన్‌కు సుమారు నెల రోజుల నుంచి ఎస్‌ఐ లేకపోవడంతో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు సీనియర్ సిబ్బంది సివిల్ పంచాయతీలు, పలు అక్రమ దందాల్లో తలదూర్చి వసూళ్లకు పాల్పడుతున్న విషయాన్ని, మరో స్టేషన్‌లో సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్న అవినీతిని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనానికి స్పందించిన సీపీ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఆ రెండు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందిని ఆరాతీసినట్లు విశ్వసనీయ సమాచారం. పనితీరు మార్చుకోవాలని సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిసింది.



ఎంపీడీవో కార్యాలయానికి

మోక్షమెన్నడో?

- జిల్లాలోని మూడు కొత్త మండలాలకుగానూ అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూర్‌పల్లి మండలాల్లో ప్రారంభమైన కార్యకలాపాలు
- దూళిమిట్టలో నేటికీ ఉమ్మడి మండలం నుంచే సిబ్బంది విధులు
- స్థానికంగా కార్యాలయం ఏర్పాటులో స్పష్టత కరువు

8



ప్రారంభానికి నోచుకోని దుబ్బాకలోని మానవ ఘనవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం

రూ.లక్షలు వెచ్చించారు..

వృథాగా వదిలేశారు!

- దుబ్బాకలో రూ.73 లక్షలతో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించి ఐదునెలలైనా అలంకారప్రాయమే
- వ్యర్థాల సేకరణలో అవగాహన కరువు
- ఎరువుల తయారీకి ఊసే లేదు

దుబ్బాక, మే 14 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత మున్సిపల్‌గా మార్చడంతో పాటు మానవ ఘన వ్యర్థాలను ఎరువుల రూపంలో వినియోగంలోకి తేవడానికి రూ.లక్షలు వెచ్చించారు. తీరా.. అవగాహన లోపం, పర్యవేక్షణ లేక దుబ్బాక మున్సిపల్‌లోని మానవ ఘనవ్యర్థాల కేంద్రం ఆచరణకు నోచుకోకుండా పోయింది. స్థానిక చేర్వాపూర్ సమీపంలో రూ.73లక్షలతో నిర్మించిన మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (పీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ - ఎఫ్ ఎస్‌టీపీ) నిరుపయోగంగా మారింది.

2021 డిసెంబరు 25న అప్పటి మంత్రి హరీశ్‌రావు దీనికి శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జనవరి 18న ప్రస్తుత రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ ప్రారంభించారు. మానవ ఘనవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ప్రారంభించి సుమారు ఐదునెలలు గడుస్తున్నా అలంకారప్రాయంగానే వదిలేశారు. ప్రారంభరోజున తెరుచుకున్న గేట్లు మళ్లీ ఇప్పటి వరకు తెరుచుకోలేదు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించగా సదరు సంస్థ ఇప్పటివరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

లక్ష్యానికి ఆమడదూరం

దుబ్బాక పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతోపాటు, పారిశుధ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో సుమారు రూ.73లక్షల వ్యయంతో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇళ్లలో నిండిన సెప్టిక్‌ట్యాంకులలోని మానవ ఘనవ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా సేకరించిన మలాన్ని వివిధ పద్ధతుల ద్వారా ఘన, ద్రవ రూపంలో సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. వాటిని



గదులకు తాళాలు వేసిన దృశ్యం

రైతులకు అందించడం ద్వారా పొలాలకు సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించడంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయ వనరులను సమకూర్చాల్సి ఉంటుంది. రైతులు రసాయన ఎరువులను వాడకుండా వారికి కావాల్సిన ఎరువులను అందజేయాలి. కానీ కేంద్రంలో ఎలాంటి పనులు జరగకపోవడంతో అనుకున్న లక్ష్యం చేరడం లేదు.

అవగాహన లోపంతో...

ఇళ్లలో, సెప్టిక్‌ట్యాంకుల్లో నిండుకున్న వ్యర్థాలను సేకరించడానికి మున్సిపల్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించలేకపోయారు. మానవ ఘనవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రంలో రోజుకు పది వేల లీటర్ల మలవ్యర్థాలను శుద్ధి చేయవచ్చు.



మానవ ఘనవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రంలో నిరుపయోగంగా పరికరాలు

మిగతా 8లో..

రక్షణగా రెడ్‌క్రాస్

మద్దూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లాలోని పీహెచ్‌సీ భవనాలపై రెడ్‌క్రాస్ గుర్తును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మద్దూరు మండల కేంద్రంతో పాటు లద్నూరులోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలపై రెడ్‌క్రాస్ గుర్తును ఏర్పాటు చేశారు. భారత్-పాక్ మధ్య సాగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో డ్రోన్లతో దాడి చేసే సమయాల్లో, ఇతర సాయుధ సంఘర్షణల సమయాల్లో ఆసుపత్రులు, వైద్యసిబ్బందితో పాటు రోగులను రక్షించడానికి రెడ్‌క్రాస్ గుర్తును ఏర్పాటు చేస్తున్నా రు. రెడ్‌క్రాస్ గుర్తును చూడగానే వాటిపై దాడులు చేయకూడదని సూచిస్తుంది. ఈ రెడ్‌క్రాస్ గుర్తు వైద్యసిబ్బందితో పాటు రోగుల రక్షణ సహాయపడుతుందని, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ గుర్తును వేసినట్లు వైద్యాధికారి రజిత తెలిపారు.



ఆసుపత్రి భవనంపై ఏర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ గుర్తు

స్ట్రక్చర్ సర్వే

ప్రైవేటు ఏజెన్సీతో నిర్వహణ

- రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వడివడిగా అడుగులు

తూప్రాన్, మే 14(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఉత్తర భాగం నిర్మాణం పనుల్లో పరిహారం చెల్లింపు కోసం స్ట్రక్చర్స్ గుర్తింపునకు (నిర్మాణాలు, చెట్లు, బోరుబావులు, బోర్లు తదితరాలు) ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. ఉత్తరభాగంలో సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - భువనగిరి - చౌటుప్పల్ వరకు 161.2 కిలోమీర్ల పొడవు నిర్మించనున్నారు. పర్యావరణ, అటవీ అనుమతులు లభించడంతో భూసేకరణకు పరిహారం చెల్లింపులు చేసే పనులు కొనసాగుతున్నాయి.

8 గ్రామాల్లో 14 కిలోమీటర్ల పొడవు

తూప్రాన్ డివిజన్ పరిధిలో వట్టూర్, నాగులపల్లి, ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి ఎనమిది గ్రామాల మీదుగా 14.055 కిలోమీటర్ల పొడవున రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 176.67 (455 ఎకరాలు) హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు. తూప్రాన్ మండలంలో నాగులపల్లి, ఇస్లాంపూర్ వద్ద 44వ జాతీయ రహదారిపై భారీ ఇంటర్ చేంజ్‌ను, నాగులపల్లి శివారులో హల్దీవాగుపై 500 మీటర్ల పొడవైన భారీ వంతెనను నిర్మించనున్నారు.

పకడ్బందీగా సర్వే



తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పరిహారం చెల్లింపు కోసం పకడ్బందీగా స్ట్రక్చర్స్ సర్వే నిర్వహించారు. అధికారుల బృందం నిర్వహించిన సర్వేను ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీతో చేపట్టింది. ఒకటి, రెండు వ్యత్యాసాలు మినహా సర్వే బాగా జరిగింది. ఒకటి, రెండు బోర్లు నమోదు జరగలేదు.

- జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్

ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో సర్వే..

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తూప్రాన్ డివిజన్ పరిధి స్ట్రక్చర్స్ గుర్తింపునకు సర్వే చేపట్టింది. భూసేకరణకు కాంపిటెంట్ అథారిటీ ల్యాండ్ అక్విజేషన్ (కాలా) ఆధ్వర్యంలో గతంలో సర్వే చేశారు. నిర్మాణాలు, చెట్లు, బోర్లను నమోదు చేశారు. ఈ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలోనే మరోసారి ఓ ప్రైవేటు కంపెనీ ద్వారా ఈ స్ట్రక్చర్స్ సర్వేను చేపట్టింది. గతంలో గుర్తించిన ప్రతీ దానిని సిబ్బంది పరిశీలిస్తున్నారు. తూప్రాన్ డివిజన్‌లో 99 శాతానికి పైగా స్ట్రక్చర్లు కచ్చితత్వంతో ఉన్నట్లు తెలిసింది.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

ప్రియుడితో కలిసి భర్త హత్య

- ఇందుకోసం ఒకరికి రూ. 50 వేల సుపారీ
- భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు

7

సర్వేయర్ల కొరతకు చెక్..!

- అర్హులైన ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్‌లు
- ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ
- ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో 60 దరఖాస్తులు
- త్వరలో భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు

7

మూగరోదన

- తాగునీటి కోసం అల్లాడుతున్న వన్యప్రాణులు
- గొంతు తడుపుకునేందుకు మైదాన ప్రాంతాలకు..
- అటవీ ప్రాంతంలో 98 చోట్ల సాసర్ పిట్లు, అక్కడ 20 సీసీ కెమెరాలు
- రాయపోల్ మండలం వడ్డేపల్లిలో ఇటీవల కుక్కను చంపిన చిరుత
- సిద్దిపేట జిల్లా పరిధిలో 8 చిరుతపులుల సంచారం

తొగుట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.. జనం మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని నీరు, శీతలపానియాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక అడవుల్లో వన్యప్రాణుల పరిస్థితి మరీ వర్ణణాతీతం. వర్షాలు లేకపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు చేరడంతో అటవీ ప్రాంతంలో కుంటలు, చెలిమలు ఎండిపోయి వన్యప్రాణులకు తాగునీటికి కష్టంగా మారింది. దీంతో అడవుల్లో నీటిజాడ లేక వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్నాయి. వన్యప్రాణుల రక్షణకు అటవీశాఖ అధికారులు పలు రకాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ గ్రామాల్లోకి అడవి జంతువులు రావడం పరిపాటిగా మారింది. మొత్తంగా 98 చోట్ల సాసర్ పిట్లను (నీటితొట్లు) ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటినిని నింపుతున్నారు.

జిల్లా పరిధిలో

జిల్లా పరిధిలో 22వేల హెక్టార్ల అడవి విస్తీర్ణం ఉంది. ఇందులో జిల్లా సరిహద్దులోని దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్, అక్బర్‌పేట-భూంపల్లి, చిన్నకోడూరు, సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 8 చిరుత పులుల సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. చిరుతలు 20 కిలోమీటర్ల పరిధిలోనే మకాం వేసి అటుఇటుగా పయనిస్తాయని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. ఇటీవల రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో పొలం వద్ద చిరుతపులి కుక్కను చంపేసింది. దౌల్తాబాద్, రాయపోల్ మండలంలో చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అంచనాకు వచ్చారు. మొత్తంగా అడవిలో చిరుతపులులతో పాటు జింకలు, అడవి గొర్రెలు, మన్నుబోతులు, కుందేళ్లు, అడవిపందులు, దుప్పులు, ఎలుగుబంట్లు, నెమళ్లు, నక్కలు తదితర అడవి జంతువులు సంచరిస్తున్నాయి.



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్ల వద్దకు నీళ్లు తాగడానికి వచ్చిన జింకలు



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్ల వద్దకు నీళ్లు తాగడానికి వచ్చిన నక్కలు

సీసీ కెమెరాల ఏర్పాటు

అడవుల్లో సంచరించే జంతువులను గుర్తించేందుకు సాసర్ పిట్ల వద్ద అటవీశాఖ అధికారులు అడవి ప్రాంతంలో ఆయా చోట్ల సుమారు 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాగు నీటి కోసం వచ్చే జంతువులు, పక్షుల చిత్రాలు సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నాయి. సీసీ కెమెరాల ద్వారా జంతువుల ఆరోగ్య పరిస్థితిని

మిగతా 8లో..



ఎల్ఈడీ వెలుగులు ఎప్పుడో..!

- రెండేళ్లైనా ఏర్పాటు కాని వీధి దీపాలు
- విద్యుత్ ఆదాకు అవకాశం

సంగారెడ్డి టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు ఇంకా అమలులో రాలేదు. గ్రామ పంచాయతీలలో వీధి దీపాల నిర్వహణ ప్రైవేట్ సంస్థకు అప్పగించాలని రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి గ్రామ పంచాయతీల పాలక వర్గాలు ఇందుకు సంబంధించి తీర్మానాలు కూడా చేశాయి. ఇందుకు సంబంధించి గ్రామాల్లో సర్వేలు కూడా పూర్తి చేశారు.

రెండేళ్ల క్రితం సర్వే

సంగారెడ్డి జిల్లాలో 633గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్కో గ్రామంలో ఎన్ని వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఏ మేరకు విద్యుత్ వినియోగం అవుతుంది. ఎన్ని ఎల్ఈడీ బల్బులు అవసరం..? తదితర వివరాలను సంబంధిత సిబ్బంది సేకరించారు. 2022 నవంబర్ నాటికి మొదటి విడత కింద 102 గ్రామాల్లో హడావిడిగా సర్వేను పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో రద్దీని బట్టి వీధి దీపాల సామర్థ్యాన్ని నిర్ణయించారు. మొత్తంగా జిల్లాకు 6వేల వీధి దీపాలు అవసరమని ప్రతిపాదించారు. ప్రతిపాదనల ప్రక్రియ పూర్తయి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు మోక్షం లభించడం లేదు.

విద్యుత్ ఆదాకు అవకాశం

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తే విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఎనర్జీ ఎఫిషియెన్సీసిస్టమ్స్ లిమిటెడ్ (ఈఈ ఎస్ఎల్) సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న ఎల్ఈడీ దీపాల పర్యవేక్షణ బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పునరుద్ధణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో)కు ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంలో ముందుకు వెళ్తుందా..? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



అడవి పందుల భయం తగ్గెదెప్పుడో


- పట్టించుకోని అధికార యంత్రాంగం




మునిపల్లి, హైద్లాపూర్, మల్లికార్జున్‌పల్లి గ్రామాల రోడ్డుకిరువైపులా దర్శనమిస్తున్న ముళ్ల పొదలు

మునిపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అడవి పందులు అనగానే పంట పొలాలను నాశనం చేస్తాయని అనుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు అడవి పందుల బారి నుంచి పంట పొలాలను కాపాడేందుకు చీరలు, షాపుల్లోవివిధ రకాల మందులను చీరలకు కట్టి కాపాడుకుంటున్నారు. కానీ ఇప్పుడు రాత్రి, పగలు అనే తేడా లేకుండా అడవి పందులు మనుషులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీలకు రాత్రి పూట వెళ్లాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ఉద్యోగులు, అటుగా వెళ్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ గ్రామాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు సెకండ్ సిఫ్ట్‌కివెళ్తున్న క్రమంలో రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదల నుంచి అడవి పంది వచ్చి దాడి చేయడంతో గాయాలవుతున్నాయని వారు వాపోతున్నారు.

రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదలను అధికారులు తొలగించకుండా ఉండడంతో అవి ఏపుగా పెరిగి అడవి పందులు ఏ పొదల చాటు నుంచి ఎప్పుడు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతుండడంతో ముళ్ల పొదలను తొలగించి అడవి పందుల బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.





మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- వైద్యవిధానపరిషత్ జాయింట్ డైరెక్టర్ డా.సుధీరా

జహీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది విధులనిర్వాహణలో అప్రమత్తంగా ఉంటు రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని వైద్యవిధానపరిషత్ జాయింట్ డైరెక్టర్ డా.సుధీరా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆమె ఆకస్మికంగా తనఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వార్డులను, శానిటేషన్, డైట్ తదితరాలను పరిశీలించారు. ఆస్పత్రికి రోగులతాకిడి అధికంగా ఉన్నందున వైద్యులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే డైట్(ఆహారం) గురించి తెలుసుకున్నారు. నాణ్యవంతమైన ఆహారాన్ని అందిస్తూ కాస్త పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని ఆమె సూచించారు.

జాతీయ జెండాను అవమానించిన వ్యక్తిపై కేసు

కుకునూరుపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గానికి చెందిన వ్యక్తి జాతీయ జెండాను, దేశ ప్రధానిని అవమానించారని పలువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తిప్పారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూపుల్లో జాతీయ జెండా, ప్రధాని నరేంద్ర మోదీని అవమానించేలా, వర్గాలు, ప్రజల ఘర్షణలు చోటుచేసునేలా పోస్టులు పెట్టాడు. ఇది గమనించి గ్రామానికి చెందిన కోరే సంతోష్ బుధవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత జాతరలో భాగంగా పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లిలో బుధవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించారు. పెద్దశంకరంపేట ప్రాంతం నుంచేకాక కల్హేర్, కంగ్టి, మనూరు, నారాయణఖేడ్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌తో విద్యార్థులకు మేలు

- జిల్లా యువజన క్రీడాధికారి దామోదర్‌రెడ్డి

వెల్దుర్తి/శివ్వంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా యువజన క్రీడాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించి విద్యార్థులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. అలాగే వెల్దుర్తి పట్టణానికి చెందిన కొత్త గంగాధర్ క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ ప్లేయర్ మహేందర్‌గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాశాఖ అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం శివ్వంపేట మండల పరిధిలోని గోమారం ఉన్నత పాఠశాల మైదానంలో జిన్నారం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు.

ఇరిగేషన్‌శాఖ ఉద్యోగి ఆత్మహత్య



రామకృష (ఫైల్)

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్తాపానికి గురైన ఇరిగేషన్‌శాఖ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తీసుకున్న రుణానికి వేతనం కట్ చేస్తుండటంతో ఆరు నెలలుగా వేతనం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మోడబోయిన రామకృష్ణ (35) ఇరిగేషన్ శాఖ (రంగనాయకసాగర్)లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్న రామకృష్ణ వేతనంపై రుణం తీసుకున్నాడు. దీంతో రుణానికి చెల్లింపులు చేసేందుకు వేతనం కట్ చేయడంతో చేతికి డబ్బులు రావడంలేదు. ఆరునెలలుగా వేతనం రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం డ్యూటీకి వెళ్తున్నట్లు భార్య లిఖితకు చెప్పి బయటకు వెళ్లినప్పటికీ, డ్యూటీకి వెళ్లకుండా చేగుంట మండలం వడియారంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం భార్యలిఖిత ప్రైవేటు కంపెనీలో విధులకు వెళ్లింది. అనంతరం ఇంటికి వచ్చిన రామకృష్ణ మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు చూసి కిందకు దించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. భార్య లిఖిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ..

నర్సాపూర్, మే 14(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం పదోవార్డులోని శ్రీరాంనగర్ కాలనీలో అద్దెకు ఉండే అవినాష్(29) బొంతపల్లి సమీపంలోని కూలీ పనిచేసేవాడు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రతిమతో వివాహం అయింది. ఏడాది నుంచి అవినాష్ మద్యానికి బానిసై పనులు చేయకుండా భార్యతో డబ్బుల కోసం తరుచూ గొడవపడుతు ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం కోసం డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. పట్టణంలో ఓ దుకాణంలో పనిచేసే భార్య ప్రతిమ ఇంటికి వచ్చి ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి సమీపంలోని వారిని పిలిచి తలుపు తీయగా ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల చెప్పారు.

గేదెను తప్పించబోయి లారీ బోల్తా

- తలకు తీవ్ర గాయాలై డ్రైవర్ అక్కడికక్కడే మృతి



బోల్తాపడిన లారీ

చిన్నకోడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): లారీకి అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపు తప్పి లారీ బోల్తాపడటంతో తలకు తీవ్ర గాయాలై ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారి పై జరిగింది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్కపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి రాకేష్ (26) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి రాకేష్, మరో లారీ డ్రైవర్ షాకీర్ హుస్సేన్ చెరో లారీలో దేవాపూర్ నుంచి సిమెంట్ బస్తాల లోడ్‌తో కరీంనగర్ మీదుగా సిద్దిపేటకు బయలు దేరారు. అర్ధరాత్రి రామునిపట్ల శివారులోకి రాగానే రాకేష్ నడుపుతున్న లారీకి గేదె అడ్డుగా వచ్చింది. రాకేష్ దానిని తప్పించబోయి అదుపు తప్పి లారీ రోడ్డు పై బోల్తా పడింది. దీంతో రాకేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదం..

మాసాయిపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రంలోని బంగారమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందగా అతడి భార్యకు తీవ్రమైన గాయాలయ్యాయి. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. చేగుంట మండలం కర్నాలపల్లికి చెందిన పెద్ద గొల్ల యాదయ్య (42) అనే వ్యక్తి తన భార్య కృష్ణమ్మతో కలిసి తూప్రాన్ వెళ్తూ మాసాయిపేట బంగారమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన పెద్ద గొల్ల యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా భార్య కృష్ణమ్మకు తీవ్రమై గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.30 వేల నగదు, 25 తులాల వెండి అపహరణ



బాధితుల నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, మే14 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి లోని ఉప్పులింగాపూర్ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన మర్కంటి మంజుల తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా మంగళవారం రాత్రి ఎవరు లేని సమయంలో ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 30 వేల నగదు, 25 తులాల వెండి అభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఖాజాపూర్ దుర్గయ్య ఇంట్లో చోరీకి యత్నించిన దొంగలు ఇంటి తలుపులను రాళ్లతో కొట్టడంతో ఇంట్లో ఉన్న వారు లేచి రావడంతో దొంగలు పరారైనట్లు దుర్గయ్య తెలిపారు.

దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న సెక్యూరిటీ సర్వీసెస్ ఉద్యోగిపై దాడిచేసి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ తూప్రాన్‌లోని నాసా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో పని చేస్తున్నాడు. గతనెల 30న మేడ్చల్ నుంచి ముప్పిరెడ్డిపల్లికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే అందులో ఇద్దరు ఉన్నారు. ముప్పిరెడ్డిపల్లి స్టాప్ వద్ద ఆటోను నిలపాలని కోరినా.. నిలపకుండా తూప్రాన్ వైపు పోనిచ్చారు. అనంతరం మనీష్‌కుమార్‌పై దాడిచేసి నగదు, మొబైల్ లాక్కొని టోల్‌ప్లాజా వద్ద తోసేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు మల్లేశం(మేడ్చల్), శ్రీకాంత్(బొల్లారం), మధు (నేరేడ్‌మెట్)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.







కల్యాణానికి హాజరైన మంత్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఘనంగా వీరభద్ర స్వామి కల్యాణం

● హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్ మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్మాట్‌పల్లిలోని వీరభద్ర స్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణానికి వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అంకురార్పణం, ధ్వజారోహణ, స్వామివారికి రుద్రాభిషేకం, గవ్యాంతం, నిత్యోపాసన, నిత్యహోమం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, ఉపనిషత్ పారాయణం, ప్రదోశకాల పూజ, గణపతి పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సమక్షంలో పల్లకీలో తీసుకువచ్చారు. భద్రకాళి సమేతులైన వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు జీలకరబెల్లం పెట్టి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, అక్షతరోపాణం, దివ్యనీరాజనం, మంత్రపుష్పాలు, మహాదాశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకుడు అవినాష్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గతంలో ఎప్పుడూ లేనివిధంగా మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి పాల్గొన్నారు.

సులభమైన పద్ధతితో బోధన చేయాలి

● ఆర్‌జేడీ విజయలక్ష్మి ● యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

సంగారెడ్డి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధన చేయాలని హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) విజయలక్ష్మి సూచించారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంలో చివరి స్థానంలో ఉన్నామని, మొదటి స్థానంలోకి వచ్చేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు. పాఠశాల కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం నాల్‌సాబ్‌గడ్డలోని యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్, పుస్తక గోదాంలోని పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పాఠశాల పాయింట్లకు పాఠ్యపుస్తకాల సరఫరా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, ఎంఈవోలు విద్యాసాగర్, జోగప్ప తదితరులు ఉన్నారు.

వైకల్యాన్ని జయించిన వాసవి

● ఇంటర్‌లో మంచి మార్కులతో పాస్
● సన్మానించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



వాసవిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి): చదువుకు వైకల్యం, పేదరికం అడ్డురావని నిరూపించింది వాసవి. చదువే లక్ష్యంగా చదివి ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి కలెక్టర్‌తో ప్రశంసలు అందుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన కె.వాసవికి రెండు కాళ్లు లేవు. ఆకుంఠితమైన దీక్షతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించింది. తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ (ఇంగ్లిష్ మీడియం)లో చేరింది. తండ్రి సహాయంతో తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోజూ హాజరై ఆధ్యాపకుల బోధనలు క్షుణ్ణంగా నేర్చుకుంది. 2025 మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 399/500 మార్కులు సాధించి సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బుధవారం మెదక్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.

సర్వేయర్ల కొరతకు చెక్..!

అర్హులైన ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్‌లు
ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
26 నుంచి జూలై 26 వరకు శిక్షణ
ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో 60 దరఖాస్తులు
త్వరలో భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు



భూ సర్వే చేస్తున్న జిల్లా ల్యాండ్ సర్వేయర్ అధికారి వినయ్ కుమార్ (ఫైల్)

సిద్దిపేట కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. దీంతో భూసర్వే పనులకు ఆటంకం కలుగుతుంది. ధరణితో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు మండల సర్వేయర్లు, ప్రజావాణి చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా సర్వేయర్ వచ్చే పరిస్థితి లేదు. ఈ ఇక్కట్లను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై దృష్టి సారించింది. ప్రైవేట్ సర్వేయర్లతో పాటు ఆసక్తి, అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయాలని నిర్ణయించింది.

మీ సేవలో దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది సర్వేయర్ల శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. 60 శాతం మార్కులతో గణితం ఓ సబ్జెక్టుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మన్(సివిల్), డిప్లొమా, బీటెక్ సివిల్ లేదా తత్సమాన అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. పాత సర్వేయర్లతో పాటు ఆసక్తి గలవారు ఈ నెల 17 లోపు మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందులో అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఒక్కో మండలానికి కనీసం ఇద్దరు చొప్పున నియమించనున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో 60 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

మూడు విడతల్లో శిక్షణ

ఎంపిక చేసిన వారికి మూడు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ, టిప్పన్ ప్లాటింగ్, ఫీల్డ్ లెవల్‌లో ట్రెయినింగ్ ఉంటుంది. అనంతరం 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విజయవంతంగా పూర్తి చేసిన వారికి జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్టు నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన వారికి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా లైసెన్స్‌లు జారీ చేస్తారు.

అలాంటి వారికి రైతుల భూములను సర్వే చేసేందుకు అధికారికంగా గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో సర్వేయర్ల కొరత తీరనుంది. ప్రస్తుతం 26 మండలాలకు గాను 16 మంది మండల సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో జిల్లాలో భూ సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయి. దాదాపు 3700 భూ సమస్యలు ఉన్నాయి. ల్యాండ్ మిస్సింగ్, పట్టాదారు పేరు తారుమారు, విస్తీర్ణంలో తేడా వంటి అనేక సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో భూ సర్వే కోసం రైతుల నుంచి అందిన దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ కారణంగా జిల్లాలో వ్యవసాయ భూములు పెద్ద ఎత్తున వెంచర్లుగా మారుతున్నాయి. నాలా కన్వర్షన్ కోసం సైతం అప్లికేషన్లు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే భూ సర్వే పనులు వేగవంతంగా సాగే అవకాశముంది.

దరఖాస్తు చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలుకు అర్హులైన ల్యాండ్ సర్వేయర్లు సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, భూ సర్వే చేసేందుకు లైసెన్స్ జారీ చేస్తుంది. జిల్లాలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

- మను చౌదరి, సిద్దిపేట కలెక్టర్

భూములను లాక్కోవాలని చూస్తే సహించం

● సర్వేను అడ్డుకున్న కామారంతండా రైతులు



వివాదాస్పద భూమిలో సర్వేను అడ్డుకుంటున్న బాధిత రైతులు

చిన్నశంకరంపేట మే 14 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా తమ భూములను లాక్కోవాలని చూస్తే సహించేది లేదని చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండా రైతులు అధికారులను హెచ్చరించారు. కొన్ని సంవత్సరాల నుంచి వివాదాస్పదంగా కొనసాగుతున్న భూమిపై బాధిత రైతులు తమ భూమి తమకు కావాలని పోరాటం చేస్తున్నారు. బుధవారం జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, ఎస్‌ఐ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఓ ప్రైవేట్ భూమిని సర్వే చేస్తుండగా బాధిత రైతులు అడ్డుకున్నారు. సర్వే డిజిటల్ మిషన్లను లాక్కునేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూములను లాక్కోవాలని చూస్తున్నారని రైతులు ఆరోపించారు. వివాదం కోర్టు పరిధిలో ఉండగా భూమిని ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. తమ భూములను కాపాడుకునేందుకు ఎంతటికైనా తెగిస్తామని, ఆత్మహత్యలు చేసుకునేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భూమిని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. భూ సర్వే చేసి హద్దులు చూపించి, సర్వే నివేదికను పై అధికారులకు సమర్పిస్తామన్నారు. న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు బాధిత రైతులను సముదాయించారు.

చేపలు పట్టే విషయమై వల్లూరులో ఘర్షణ

● గ్రామంలో మోహరించిన పోలీసు బలగాలు



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ వెంకటరాజాగౌడ్, మత్స్య శాఖ ఏడీ మల్లేశం

చేగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండల పరిధిలోని వల్లూరు గ్రామంలోని చెరువు, కుంటలలో చేపలు పట్టే విషయమై ఏడాదిగా ముదిరాజ్‌లు, ఇతర కులస్థుల మధ్య వివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ముదిరాజ్, మత్స్య సహకార సంఘాలకు చేపలు పట్టుకునేందుకు కోర్టు అనుమతిచ్చింది. దీంతో బుధవారం చేపలు పట్టడానికి ముదిరాజ్ సంఘ సభ్యులు వెళ్లగా, తమకూ వాటా ఉందని, చేపలు పట్టవద్దని ఇతర కులస్థులవారు పట్టుబట్టడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ముదిరాజ్ సంఘం సభ్యుల ముందస్తు ఫిర్యాదు మేరకు రామాయంపేట సీఐ వెంకటరాజ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసు బలగాలతో మోహరించారు. అనంతరం సీఐతోపాటు, మత్స్యశాఖ ఏడీ మల్లేశం ఇరు వర్గాలను గ్రామ చావిడి వద్ద కూర్చోబెట్టి మాట్లాడారు. 20 రోజుల వరకు ఎవరూ చేపలు పట్టవద్దని ఇరువర్గాలను ఒప్పించారు. ఆ తరువాత ప్రభుత్వం ఎవరి పక్షాన ఉత్తర్వుల ఇస్తే వారు చెరువులో చేపలు పట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఒప్పందానికి ఇరువర్గాలు కట్టుబడి ఉండాలని, చట్టాన్ని ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

ప్రియుడితో కలిసి భర్త హత్య

● ఇందుకోసం ఒకరికి రూ. 50 వేల సుపారీ
● భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు



మైలి శ్రీను(ఫైల్)

హవేళిఘణపూర్, మే 14; (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి హత్య చేసిందో భార్య. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలో శమ్నాపూర్‌కు చెందిన మైలి శ్రీను(25) వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏప్రిల్ 16 నుంచి కనిపించకుండాపోయాడు. అదే నెల 28న అతని భార్య లత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. అనుమానంతో భార్యను విచారించగా, అసలు విషయం బయటపడింది. లత అదే గ్రామానికి చెందిన మల్లేశంతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో మందలించడంతో పాటు పలుమార్లు పెద్ద మనుషులతో పంచాయతీలు జరిగాయి. అయినా, తీరు మార్చుకోని నిందితురాలు అడ్డుగా ఉన్న భర్తను కడతేర్చాలని ప్రియుడితో కలిసి పథకం వేసింది. అదే గ్రామానికి చెందిన మోహన్‌కు రూ. 50 వేల సుపారీ ఇచ్చింది. ముగ్గురు కలిసి ఏప్రిల్ 16న మధ్యాహ్నం శ్రీనును బ్యాతోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం, కల్లు తాగించి తలపై సీసాతో కొట్టి చంపేశారు. అనంతరం భార్య ఏం తెలియనట్లు భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు విచారణ జరపగా, జరిగిన విషయం తేలింది. దీంతో నిందితురాలు మైలి లత, ఆమె ప్రియుడు మల్లేశం, సుపారీ తీసుకున్న మోహన్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు చెప్పిన ఆధారాల ప్రకారం హత్య జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. దీంతో సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు.

క్రైం కార్నర్

కుటుంబ సభ్యులంతా దొంగలే

సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో చోరీలు
మొత్తం 53 కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్
29తులాల బంగారం, రూ. 4లక్షల నగదు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం

సంగారెడ్డి క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలతోపాటు మరో మహిళ, బాలుడు.. ఒకే కుటుంబానికి చెందిన ఈ నలుగురు జల్సాలకు అలవాటు పడ్డారు. తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలని పగలు వీధుల్లో రెక్కీ నిర్వహించి, రాత్రిళ్లు చోరీలు చేసేవారు. ఇలా సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. అంతా కలిసి మొత్తం 53 దొంగతనాలు చేశారు. సంగారెడ్డి రూరల్ పోలీసులు బుధవారం సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ వెల్లడించారు. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన మార్ల యాదగిరి (44) మేస్త్రీ పనిచేస్తుండగా అతని భార్య మార్ల అనిత (42)తో పాటు వారి బంధువు అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌కు చెందిన తలారి లక్ష్మి (34), మరో బాలుడు(17)లు కలిసి పగలు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను ఎంచుకునేవారు. రాత్రి దొంగతనాలకు పాల్పడేవారు. ఇలా సంగారెడ్డి జిల్లా హత్నూర, సంగారెడ్డి టౌన్,రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు, వికారాబాద్, మొమిన్‌పేట, సైబరాబాద్, నర్సాపూర్‌లలో 47 చోరీలు చేశారు. మొత్తం 53 దొంగతనాలకు పాల్పడ్డారు.

పోలీసులకు చిక్కారిలా..

సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా ఏపీ 23 టీఏ 0092 నంబరు గల ఆటోలో నలుగురు అనుమానాస్పదంగా వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని విచారిస్తే నేరం అంగీకరించారు. నిందితుల నుంచి 29 తులాల బంగారం, 47 తులాల వెండి, రూ.4లక్షల నగదుతో పాటు ఒక స్ప్లెండర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ సత్తయ్య తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రవీందర్, క్రైం సిబ్బంది షాకీర్, నాగరాజు, రాజు, నర్సింహులులను డీఎస్పీ అభినందించారు.

చెరువు మట్టి.. చేనుకు బలం

● ఒండ్రు మట్టిలో పోషకాలు పుష్కలం
● పొలాల భూసారం పెరుగుదల
● చీడపీడల బెడద కూడా తక్కువే
● ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ భూములకు తరలింపు



అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో రైతు పొలంలో పోసిన చెరువు మట్టి

అక్కన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలలోని మట్టిలో అనేక పోషకాలు ఉంటాయి. ఈ మట్టిని పొలంలో వేసుకుంటే భూమి సారవంతంగా మారి మంచి పంట దిగుబడి వస్తుంది. దీంతో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు చెరువు మట్టిని తమ పొలాల్లోకి చేరవేస్తున్నారు. దీంతో రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం కూడా గణనీయంగా తగ్గుతుంది.

చెరువు మట్టిలో పోషకాలు

జిల్లా వ్యాప్తంగా వర్షాధార, బోరుబావులు, కుంటాల కింద సాగయ్యే భూములు అధికంగా ఉన్నాయి. అలాంటి భూముల్లో చెరువులో నుంచి తీసిన పూడికతీత మట్టిని పోయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. ఈ మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు పలు పోషకాలు విరివిగా ఉంటాయి. అంతేకాక నేలలో తేమ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చు. నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో పంటలకు మేలు కలుగుతుంది. సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటివి పంటలకు రోగాల బారి నుంచి కాపాడుతాయి.

అధిక దిగుబడులు సాధించవచ్చు

చెరువు మట్టిని పంట పొలాల్లో పోయడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చు. ఈ మట్టితో భూమి గుల్ల బారుడు తనం పెరిగి నాటిన మొక్కలు లోతుగా చొచ్చుకుపోతాయి. ఈ క్రమంలో వేర్లకు బలం చేకూరుతుంది. అలాగే చెరువు మట్టి మూడేళ్ల వరకు పనిచేస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో అన్ని చెరువులో ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత కొనసాగుతుంది.

భూసారం పెరుగుతుంది



చెరువు మట్టి ద్వారా భూసారం పెరుగుతుంది. చెరువు మట్టి పోలాలకు వేయడం వల్ల పంటలు మంచి దిగుబడి వస్తాయి. ఎరువుకంటే ఎక్కువగా పని చేస్తుంది. గతంలో కూడా చాలా మంది రైతులు చెరువు మట్టిని పోలాలకు వేయడం వల్ల పంటలు బాగా పండాయి. అందుకే ప్రతి వేసవిలో చెరువు మట్టిని ఉపాధి హామీ పథకం ద్వార పోలాలో పోసుకోమని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-సబిహా, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, అక్కన్నపేట



వేసవి దుక్కులతో లాభాలెన్నో..

కొండపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతులు నిర్లక్ష్యం చేయకుండా వేసవి దుక్కులు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం వరకు భూమిని దున్నకుండా ఉంచడం వల్ల భూముల్లో కలుపు మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి నిస్సత్తువగా మారుస్తాయి. ఫలితంగా భూసారం తగ్గిపోతూ ఉంటుంది. అలాగే భూమిని దున్నకుండా ఖాళీగా ఉంచడం వల్ల భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెంది.. తర్వాత వేసే పంటలకు తీవ్ర నష్టం చేకూరుస్తాయి. ఈ నష్టాలను అధిగమించేందుకు వేసవిలో లోతు దుక్కుల మీద రైతులు దృష్టి సారించాలి.

భూసారం పెరుగుతుంది

వర్షాలకు ముందే దున్నడం వల్ల తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో తేమ శాతం పెరుగుతుంది. పంట వేర్లు కూడా ఎక్కువ లోతుకు వెళ్తాయి. దీని వల్ల వర్షాధార పంటలు కీలక దశల్లో బెట్టకు గురైనప్పుడు నేల లోపలి పొరల్లోని తేమ, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తి ఆ పంటకు లభిస్తుంది. లోతు దుక్కుల వలన ఖరీఫ్, రబీ పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంట మొక్కల ఆకులు భూమిలో కలిసిపోయి సేంద్రియ పదార్థాలు, ఎరువుగా మారతాయి. దీని వల్ల నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాములు వృద్ధి చెంది భూసారం మరింత పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో పశువుల పెంట, కంపోస్టు ఎరువులు, చెరువుల్లోని మట్టిని వేయడం వల్ల భూసారం మరింత పెరిగి దిగుబడి వృద్ధి చెందుతుంది.

చీడపీడలను నివారించవచ్చు

వేసవిలో లోతు దుక్కులతో భూమిలో దాగి ఉన్న చీడపీడల కోశాలు, గుడ్లు బయటపడి ఎండ వల్ల నశిస్తాయి. భూమి పైన పురుగు ప్యూపాలను, గుడ్లను కొంగలు ఇతర పక్షులు తినేస్తాయి. దీని వల్ల వాటి ఉధృతి బాగా తగ్గి పురుగు, తెగుళ్ల మందుపై పెట్టే ఖర్చు కొంతవరకు తగ్గుతుంది.

ఎంపీడీవో కార్యాలయానికి మోక్షమెన్నడో?

- జిల్లాలోని 3 కొత్త మండలాలకుగానూ అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూర్‌పల్లి మండలాల్లో ప్రారంభమైన కార్యకలాపాలు
- దూళిమిట్టలో నేటికీ ఉమ్మడి మండలం నుంచే సిబ్బంది విధులు
- స్థానికంగా కార్యాలయం ఏర్పాటులో స్పష్టత కరువై ఇక్కట్లు



దూళిమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయం

దూళిమిట్ట, మే14(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది దూళిమిట్ట ఎంపీడీవో కార్యాలయం పరిస్థితి. నూతనంగా ఏర్పడిన మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సిద్దిపేట జిల్లాలో కలెక్టర్ మూడు నూతన కార్యాలయాలు ఏర్పాటు చేసి సిబ్బందిని సైతం కేటాయించారు. ఇందులో అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూర్‌పల్లి మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు గత నవంబర్‌లో ప్రారంభమై కార్యకలాపాలు నిర్వహిస్తున్నా, ధూళిమిట్ట మండల ఎంపీడీవో కార్యాలయం నేటికీ ప్రారంభం కాకపోవడం పట్ల మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పనుల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని మండిపడుతున్నారు.

ఉమ్మడి మండలం నుంచే కార్యకలాపాలు

ధూళిమిట్ట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా వీరరాజును, ఎంపీవోగా వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ గత మార్చి నెలలో ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అధికారులు ఇంకా ఉమ్మడి మద్దూర్ మండల ఎంపీడీవో కార్యాలయం నుంచే ధూళిమిట్ట మండల ఎంపీడీవో కార్యాలయం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ధూళిమిట్ట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేస్తే అధికారులు ఇంకా ఉమ్మడి మండలం నుంచే కార్యకలాపాలు నిర్వహించడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భవనంపై స్పష్టత కరువు

నేటి వరకు ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసే భవనంపై స్పష్టత రాలేదు. గతంలో తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయంలోనే ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్వహించేందుకు ప్రతిపాదన రాగా ఆ తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో పలువురు వ్యతిరేకించారు. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు కోసం స్థానికంగా ఓ అద్దె గదిని సైతం చూశారు. అయితే కారణాలేంటోగానీ నేటికీ ప్రారంభించకపోవడం గమనార్హం. అసలు ఆ గదిలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారా లేక మరోచోట ఏర్పాటు చేస్తారా అనే విషయం కూడా చర్చనీయాంశంగా మారింది. భవనం ఏర్పాటులో కానీ, కార్యకలాపాలు నిర్వహించడానికి కానీ ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు మండల అధికారులు యత్నించడం లేదా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. భవనం ఏర్పాటుకు ఇంకెన్నాళ్లు వేచి చూడాలో అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జాప్యంపై వీడని సస్పెన్స్

కాగా దూళిమిట్టలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు విషయమై సంబంధిత మండల అధికారులను సంప్రదించగా మండలకేంద్రంలో కార్యాలయాన్ని ప్రారంభించాల్సి ఉందంటున్నారు. ప్రారంభించిన వెంటనే అక్కడినుంచే విధులు నిర్వహిస్తామని చెబుతున్నారు. అయితే కార్యాలయాన్ని ప్రారంభించడంలో జాప్యానికి కారణాలేంటో కచ్చితంగా చెప్పడం లేదు. తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుందామనుకుంటే ఉమ్మడి మద్దూరు మండల కేంద్రానికి వెళ్లాల్సివస్తోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయ భవనం ఏర్పాటుపై స్పష్టతనిచ్చి వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి



దూళిమిట్ట మండల ఎంపీడీవో కార్యాలయం అసలు ఎక్కడుందో తెలియని అయోమయ పరిస్థితిని మండల ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో, ఇతర అధికారులను నియమించినా వారు ఎక్కడి నుంచి పనిచేస్తున్నారో ప్రజలకు తెలియడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎంపీడీవో కార్యాలయ కార్యకలాపాలు దూళిమిట్ట మండల కేంద్రంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలి.

-భామండ్లపల్లి క్రిష్ణ, దూళిమిట్ట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

వేర్వేరు ఘటనల్లో ఆత్మహత్యాయత్నం.. ఇద్దరి మృతి


కలవ్వ(ఫైల్)


అనిల్(ఫైల్)

మిరుదొడ్డి/గజ్వేల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ఘటనల్లో పురుగుల మందు తాగిన ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుల్లో ఒకరు మహిళ కాగా, మరో యువకుడు ఉన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె గ్రామానికి చెందిన నర్మెట కలవ్వ(52) అనే మహిళ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఈ నెల 12న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే సిద్దిపేట ఆసుపత్రికి తీసుకెళ్లి, మెరుగైన చికిత్సకోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున కలవ్వ చికిత్సపొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. మరో ఘటనలో.. గజ్వేల్ మండలంలోని రంగంపేటలో ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన నడిగపూల అనిల్(23) గత నెల 27న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవోకు ఫిర్యాదు

రాయపోల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ పలువురు గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో బాలయ్యకు వినతి పత్రం అందజేశారు. పనుల నిమిత్తం పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్తే దురుసుగా సమాధానమిస్తున్నారని, పారిశుధ్యాన్ని సరిగా నిర్వహించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శిని మార్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు అంజనేయులు, సత్తయ్య, స్వామి, కుమార్ తదితరులున్నారు. ఎంపీడీవో బాలయ్యను వివరణ కోరగా తాను గ్రామాన్ని సందర్శించి వివరాలను సేకరించి, పై అధికారులకు తెలియజేస్తానని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఈ నెల 20న ఇసుక వేలం

మద్దూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తూ పట్టుబడిన ఇసుకకు ఈ నెల 20న వేలం నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు రహీం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయం ఆవరణలో రెండు ట్రాక్టర్లలో 5 టన్నుల ఇసుకకు వేలం నిర్వహిస్తున్నామని, అసక్తి గలవారు ముందుగా రూ.10 వేల డిపాజిట్ ఈ వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

దుబ్బాక, మే 14 (ఆంధ్రజ్యోతి): అక్బర్ పేట-భూంపల్లి మండలం పోతరెడ్డి పేట గ్రామంలో రెండు రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో ఉపాధిహామీ కూలీలు మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందిన ఉపాధి హామీ కూలీలు చంద్రవ్వ, దేవవ్వల కుటుంబాలను పరామర్శించారు. అలాగే రాజిరెడ్డి కుటుంబాన్ని, నగరం గ్రామానికి చెందిన మాజీమంత్రి చెరుకుముత్యంరెడ్డి అభిమాని కిష్టాగౌడ్ ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

గుట్టలను ధ్వంసం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్ చెరువు గుట్టలను ధ్వంసం చేస్తున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. వందల ఎకరాల్లో ప్రకృతి రమణీయత కలిగి, వన్యప్రాణులకు నిలయంగా ఉన్న బైరాన్ చెరువు గుట్టల నుంచి వందలాది టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మట్టి మాఫియాపై విచారణ జరిపించి ప్రకృతిని కాపాడాలని ఆయన కోరారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు ఎనగందుల శంకర్, మారపల్లి సుధాకర్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

దుబ్బాక, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని 18వ వార్డుకు చెందిన అశోక్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.25,500 విలువైన చెక్కును దుబ్బాకలోని సీఎస్‌ఆర్ కార్యాలయంలో అందించారు. ఆయన వెంట 18వవార్డు నాయకురాలు శ్రీరాం సరస్వతి, నరేందర్, ఏసురెడ్డి, భరత్, రాజిరెడ్డి ఉన్నారు.

పేదింటి సంక్షేమానికి పెద్దపీట

చేర్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): పేదింటి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన దేవనబోయిన సుదర్శన్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని నాగపురి కిరణ్‌కుమార్ మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.25లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం ఎల్‌వోసీ ప్రతిని అతడి కుటుంబసభ్యులకు అప్పగించారు.

యువతి వివాహానికి చేయూత

మద్దూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాఖ్‌పూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్ర విజయ కూతురు అర్చన వివాహానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గడిపె అనిల్‌కుమార్ బుధవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడారు. కుటుంబ పెద్దను కోల్పోయి బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేస్తూ ముగ్గురు ఆడపిల్లలను పోషిస్తూ కూతురు పెళ్లికి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలుసుకుని ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం


లింగంపేట పెద్దమ్మ ఆలయంలో బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పూజలు

తొగుట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట గ్రామంలో బుధవారం పెద్దమ్మ- పెద్దిరాజ్‌ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు ఇరువురికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్దమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సోలిపేట సుజాత, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఏసీపీ


కొమురవెల్లిలో మల్లన్న ఆలయ వెనకదారి క్యూలైన్లు పరిశీలిస్తున్న హుస్నాబాద్ ఏసీపీ

చేర్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని హుస్నాబాద్ ఏసీపీ సదానందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలు పరిశీలించి బందోబస్తు చర్యలపై ఆరా తీశారు. అనంతరం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కేసులు, నేరాల నమోదు తదితర విషయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువ కేసులు నమోదవుతున్నందున ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం గుర్జకుంట శివారులోని చెక్‌పోస్ట్ పరిశీలించారు. వెంట చేర్యాల సీఐ ఎల్. శ్రీను, ఎస్‌ఐ రాజు ఉన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ డీఎం ప్రవీణ్

హుస్నాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షంతో తడిసిన ధాన్యాన్ని బుధవారం పౌరసరఫరాల శాఖ డీఎం ప్రవీణ్, డీసీవో నాగేశ్వర్‌రావు పరిశీలించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసే వరకు కేంద్రాలను ఎత్తివేయబోమన్నారు.

బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ, అత్తుఇమామ్

సిద్దిపేట అంధ్రజ్యోతి, మే 14: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే ముందు బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కోటిలింగేశ్వర ఆలయంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకులు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తుంటే, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు మింగుడు పడడం లేదని విమర్శించారు. ఈటల రాజేందర్ లేనిపోని వ్యాఖ్యలు చేస్తూ తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని, ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మరోసారి జగ్గారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని, బిజెపి, బీఆర్‌ఎస్ నాయకుల కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, గంప మహేందర్‌రావు, దేవులపల్లి యాదగిరి, మార్క సతీష్‌గౌడ్, రజిని, సన, సలీం, సాయిప్రతాప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గామాత ఆలయానికి మాజీమంత్రి హరీశ్‌రావు గ్రానైట్ వితరణ


హరీశ్ రావు అందజేసిన గ్రానైట్‌తో ఆలయ కమిటీ సభ్యులు

సిద్దిపేట కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణం లింగారెడ్డిపల్లిలో నిర్మిస్తున్న శ్రీవనదుర్గా అమ్మవారి ఆలయానికి మాజీమంత్రి హరీశ్‌రావు రూ.లక్ష విలువైన గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామస్థుల కోరిక మేరకు గ్రానైట్‌ను అందించినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు మాజీమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ములుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సహాయం అందించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి కేబీఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని ఫౌండేషన్ కొన్యాల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని వాగునూతి గ్రామంలో రాముడు, హనుమంతుని ఆలయాల నిర్మాణానికి రూ.5,01,016 విరాళాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ తారక సురేష్‌తో పాటు వాగునూతి గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

వరదరాజస్వామి ఆలయానికి..


ప్రముఖులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

మర్కుక్, మే 14 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం వరదరాజపురంలో బుధవారం శ్రీ వరదరాజ స్వామిని దర్శించుకున్న మర్కుక్ మండల బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఆలయ నిర్మాణానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ పాండుగౌడ్, నాయకులు రామచంద్రం, మంద బాలరెడ్డి, లక్కాకుల నరేష్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ పొద్దుటూరు బాలకృష్ణ, తుమ్మ కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహం ధ్వంసం

- గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

నంగునూరు, మే 14 (అంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద విగ్రహం ధ్వంసం అయ్యింది. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్వామి వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసినప్పటికీ బుధవారం రాత్రి వరకు ఎవరూ గమనించలేదు. విషయం తెలుసుకున్న బీజేపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విగ్రహాన్ని ముక్కు, చెవులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో రాజగోపాలపేట పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం


నంగునూరు: వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్వేత

నంగునూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితోనే సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని అని దోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు శ్వేత, సరిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని సాగుకు అనుగుణంగా పంటలో రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడుకోవచ్చన్నారు. నేల సారవంతాన్ని బట్టి అవసరం మేరకే రసాయన ఎరువులు వాడుకోవాలని సూచించారు. సీడ్స్ కొనుగోలు చేసే సమయంలో ప్రతీ రైతు రసీదు పొందాలన్నారు. ప్రతీ మంగళవారం పాలమాకుల రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా రావాలన్నారు. ఆయిల్‌పామ్ పంటల్లో 3ఏళ్ల వరకు అంతర్ పంటలను సాగు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ తోటలకు కోతుల బెడద, ఈదురు గాలుల బాధ, అడవి పందులతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. రైతులు అవగాహన లేకపోవడం వలన వరి కొయ్యలు కాల్చి వేస్తున్నారని వాటిని కాల్చి వేయడం వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి గీత, హార్టికల్చర్ అధికారి భాస్కర్, రైతు ఉత్పత్తుల సంఘం మండల సీఈవో అశోక్ గౌడ్, వివిధ గ్రామాల క్లస్టర్ ఏఈవోలు పాల్గొన్నారు

మందపల్లిలో..



సిద్దిపేట అర్బన్: మందపల్లిలో మాట్లాడుతున్న ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు

సిద్దిపేట అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామంలో ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు మొక్క సబ్సిడీ వివరాలు, డ్రిప్ సబ్సిడీ వివరాలు, సాగు వల్ల కలిగే లాభాలు వివరించినట్టు ఉద్యానవనశాఖ అధికారి కౌసల్య, వ్యవసాయాధికారి శ్రీనాథ్, ఆయిల్‌ఫెడ్ అధికారి శంకర్ తెలిపారు. మందపల్లిలో ఆయిల్‌పామ్ సాగు 80 ఎకరాల్లో విస్తరించిందన్నారు. ఇటీవల జరిగిన గాలివానల కారణంగా నష్టపోయిన మామిడి రైతులు ఆయిల్ పామ్ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలిపారు. 4 ఎకరాల్లో సాగుచేస్తే రూ.2 నుంచి 3లక్షల వరకు లాభం పొందవచ్చని వివరించారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

అక్కన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఉట్కూరి అనంతరెడ్డి అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం కట్కూరు రెవెన్యూ పరిధిలోని దాసుతండాలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 24 గ్రామపంచాయతీల్లో సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 2000 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మద్దూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌ల రద్దుకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోరుతూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలో మే 20 సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆలేటి యాదగిరి, సిఐటీయూ మండల కన్వీనర్, మండల కార్యదర్శి ఎండీ. షఫీ, అల్ల రమేష్, నరేష్, సురేష్, చందు ఉన్నారు.

నేడు సిద్దిపేటలో తెప్పోత్సవం



మాట్లాడుతున్న రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

సిద్దిపేట కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇద్దరు, సిద్దిపేటలో నలుగురు స్వాములతో మొదలైన హనుమాన్ దీక్ష మాలధారణ నేడు విశ్వవ్యాప్తం అయ్యిందంటే అందుకు అఖిలభారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ అంకుఠిత దీక్షయే కారణమని శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. హనుమాన్ స్వాములకు అన్నప్రసాదం సిద్దిపేటలోనే మొదలైందని, అలాగే విజయవాడలో మాత్రమే నిర్వహించే తెప్పోత్సవం కూడా సిద్దిపేటలో మాత్రమే నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ట్రస్టు సభ్యులు మాట్లాడారు. ఈనెల 15వ తేదీన సాయంత్రం 5 గంటలకు సిద్దిపేట కోమటి చెరువులో హనుమాన్ తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రామరాజు రావి చెట్టు హనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్రగా బయలుదేరి కోమటి చెరువు వద్ద దుర్గాప్రసాద్ స్వామీజీ చేతుల మీదుగా తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.


అటవీ ప్రాంతంలో సాసర్ పిట్ల వద్దకు నీళ్లు తాగేందుకు వచ్చిన జింక

మూగరోదన

(5వ పేజీ తరువాయి)

అంచనా వేసేందుకు అవకాశముంటుంది. దాంతో పాటు జంతు గణనకు కూడా తోడ్పడే అవకాశముంది.

తాగునీటి కోసం ఏర్పాట్లు



వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అటవీ ప్రాంతంలో నీటి తొట్లు(సాసర్ పిట్లను) ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. జంతువుల కదలికలు గుర్తించేందుకు వాటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. జిల్లా సరిహద్దు మండలాల్లో సుమారు 8 వరకు చిరుతపులుల సంచరిస్తున్నట్లు గుర్తించాం. చిరుతపులుల సంచారమున్న ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల వద్దకు రైతులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలి.

- సందీప్‌కుమార్ (ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, దుబ్బాక)

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు!

(5వ పేజీ తరువాయి)

కానీ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులకు, ప్రజల్లో చైతన్యం కల్పించలేకపోవడంతో అవగాహన లేక సేకరణ సాధ్యం కావడం లేదు. లక్షలాది రూపాయాలను వెచ్చించి నిర్మించిన కేంద్రంలో కనీసం మున్సిపల్ ద్వారా ట్యాంకర్లను ఏర్పాటు చేస్తే, కొంత ప్రయోజనం ఉండేది. ప్రైవేటు ట్యాంకర్ల యజమానులతో కూడా అధికారులు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ప్రైవేటు సంస్థలు, సెప్టిక్‌ట్యాంకులను శుభ్రపరిచే ట్యాంకర్ యాజమానులు కనీసం గోడలపై తమ ఫోన్‌నంబర్‌లతోపాటు సంప్రదించాల్సిన సమాచారాన్ని రాసి ప్రచారం చేసి సేకరించిన వ్యర్థాలను మాత్రం పట్టణ శివారులోని పాడుబడిన బావుల్లో వదిలి వెళ్తున్నారు. మున్సిపాలిటీ ద్వారానే మలవ్యర్థాల సేకరణ చేపట్టేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంతో పాటు పారిశుధ్యం, పర్యావరణానికి తోడ్పాటునిస్తుందని పట్టణవాసులు చెబుతున్నారు.